సాక్షి తిరుపతి

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



చావే శరణ్యం

తమకు పరిహారం చెల్లించకుండా ఇళ్లు తొలగించడంతో తమకు చావే శరణ్యమంటూ నిర్వాసితులు రోడెక్కారు. - 8లో



మార్చికి వందశాతం ఇళ్లు

వచ్చే మార్చి 31 తేదీనాటికి వందశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని జేసీ శుభం బన్సల్ తెలిపారు. - 8లో



ఫిర్యాదుల వెల్లువ

తిరుపతి క్రైం: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెలువెత్తినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. 104 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

న్యూస్‌రీల్

సంగీతంలో పీజీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఎంఏ సంగీతం, డిప్లొమో ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం) కోర్సులకు ఆసక్తిగల విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను వచ్చేనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని, ఆదే నెల 31న స్పాట్ అడ్మిషన్లకు సైతం అవకాశం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను గానీ 0877-2284524, 81217 87415 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎస్వీయూ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా రమేష్ బాబు



నూతన డైరెక్టర్ రమేష్‌బాబుకు నియామక పత్రాలు అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఊకా రమేష్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ సీహెచ్ అప్పారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రధాన కార్యాలయంలో నూతన డైరెక్టర్‌తోపాటు జాయింట్ డైరెక్టర్‌గా టి.మధు, డిప్యూటీ డైరెక్టర్‌గా శంకర్ గణేష్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో డైరెక్టర్‌గా నియమితులైన ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ మురళి పదవీకాలం పూర్తి కావడంతో ఈ నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన వీసీ, రిజిస్ట్రార్ కృతజ్ఞతలు తెలిపారు.

డాక్యుమెంట్స్ పక్కాగా ఉండాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి అర్బన్: జిల్లా విజన్ డాక్యుమెంట్స్ పక్కాగా ఉండాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్వర్ణాంధ్ర 2047 వాల్‌పోస్టర్‌ను జేసీ శుభం బన్సల్‌తో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడువులోపు మండల, డివిజన్, జిల్లా డాక్యుమెంట్స్ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు చంద్రశేఖర్‌నాయుడు, రామ్మోహన్, నరసింహులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ తిరుపతి ఈఈగా చంద్రశేఖర్



తిరుపతి రూరల్: ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా తిరుపతి టౌన్ ఈఈగా బదిలీపై వచ్చారు. ఇక్కడ ఈఈ గా ఉన్న వాసుదేవరెడ్డి చిత్తూరు డివిజన్ ఎంఅండ్‌పీ డివిజన్ ఈఈగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి డివిజన్ పరిధిలో వినియోగదారులకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యమన్నారు. వంద శాతం రెవెన్యూ వసూలు చేస్తామన్నారు. నూతన ఈఈగా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌ను డీఈ అంజనేయులు, ఏఈలు రజనీకుమార్, మునిరామ్, శ్రీనివాసులునాయుడు, సిబ్బంది అభినందించారు.

అంబేడ్కర్ భవనం కూల్చివేతపై ఫిర్యాదు



ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎస్సీలు

ఏర్పేడు: మండలంలోని వికృతమాల ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ భవనం కూల్చివేతపై ఎస్సీలు సోమవారం శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వం వికృతమాల ఎస్సీ కాలనీకి సమీపంలో అంబేడ్కర్ భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక టీడీపీ నాయకులు భవనాన్ని కూల్చివేయాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో ఈ నెల 18వ తేదీన నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ భవనాన్ని రెవెన్యూ అధికారులు జేసీబీతో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కక్షపూరితంగా ఎస్సీలు నిర్మించుకున్న భవనాన్ని కూల్చివేయడం జరిగిందన్నారు. విచారణ చేపట్టి తగు న్యాయం చేయాలని అర్జీ అందజేశారు. విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ ఎస్సీలకు హామీ ఇచ్చారు.





విద్యుత్ కాంతుల్లో అమ్మవారి మండపం (ఇన్‌సెట్) ప్రత్యేకలలంకరణలో అమ్మవారు

మమ్మేలు పోలేరమ్మ.. కరుణించరావమ్మా!

గ్రామశక్తిగా ఆవిర్భవించి..కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న వెంకటగిరి పోలేరమ్మ జాతరకు సమయం ఆసన్నమైంది.

ఈ పండుగ వేళ బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులంతా ఒకటై అమ్మవారిని కొలవడం ఆనవాయితీ. దేశ, విదేశాల్లో ఉన్న కుటుంబ సభ్యులంతా వెంకటగిరికి చేరి, ఆత్మీయత.. అనురాగాల నడుమ ఆనందంగా జాతర జరుపుకుంటారు. మమ్మేలు పోలేరమ్మ..కరుణించవమ్మా అని మొక్కుకుంటారు.

రేపటి నుంచి జాతర

- భక్తుల ఇలవేల్పు పోలేరమ్మ తల్లి
- కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి
- వెంకటగిరీయుల ఆరాధ్య దైవం.. వరాలొసగే తల్లి
- జాతర చూద్దాం రారండోయ్..
- గత ఏడాది నుంచి రాష్ట్ర పండుగగా గుర్తింపు

వెంకటగిరి(సైదాపురం): గ్రామశక్తి పోలేరమ్మ తల్లి జాతర వచ్చే బుధవారం ప్రారంభం కానుంది. 105 ఏళ్ల క్రితం 1919లో ప్రారంభమైన పోలేరమ్మ జాతర నేటికి క్రమం తప్పకుండా జరుగుతోంది. అప్పట్లో కలరా సోకి వేలాదిగా మృత్యువాత పడుతున్న వేళ వెంకటగిరి సంస్థానాధీశులు శీతలయాగం చేసి గ్రామం చుట్టూ అష్ట దిగ్బంధనం చేయించి, పోలేరమ్మకు జాతర చేసి, మత్యు ఘంటికలను నిలిపారు. నాటి నుంచి గ్రామశక్తి పోలేరమ్మ తల్లికి ఏటా జాతర చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లే పోలేరమ్మ వెంకటగిరీయుల ఆరాధ్య దైవంగా నిలిచింది. దేశ విదేశాలలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్న వెంకటగిరి వాసులు సైతం జాతర రోజు ఇక్కడికి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లిస్తుంటారు.

25, 26వ తేదీల్లో..

ఈ నెల 25, 26 తేదీల్లో పోలేరమ్మ జాతర ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

బంధాలు..అనుబంధాల వేదిక

బంధాలు.. అనుబంధాల కలయికకు అరుదైన వేదికగా వెంకటగిరి జాతర జరుగుతుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎక్కడెక్కడో స్థిరపడి వారు సైతం జాతరకు ఒక్కటై గత స్మృతులను నెమరు వేసుకుంటారు. పోలేరమ్మతల్లిని జాతరలో దర్శించుకుంటే ఆ ఏడాది అంతా సవ్యంగా సాగుతుందన్న నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. రాజాల పర్యవేక్షణలో జరుగుతున్న పోలేరమ్మ జాతర 1992వ సంవత్సరం నుంచి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వెంకటగిరి పోలేరమ్మకు వెంకటగిరి రాజాలు పట్టు వస్త్రాలు సమర్పించే పద్ధతి నేటికీ కొనసాగుతోంది.

కుమ్మరిల్లే పుట్టినిల్లుగా.. చాకలి ఇల్లు మెట్టినిల్లుగా..

పోలేరమ్మ పుట్టినిల్లుగా భావించే కుమ్మరి ఇంట అమ్మవారి ప్రతిమను మట్టితో తయారు చేస్తా రు. అక్కడ గంపలో అమ్మవారి ప్రతిమను ఎవరు చూడకుండా చాకలి ఇల్లైన మెట్టినింటికి చేర్చుతారు. అక్కడ అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క పెట్టకుండా ఉంచుతారు. ఎందుకంటే అమ్మవారికి అన్ని అలంకరణలో ఉంటే ఉగ్రరూపం చూడాల్సి వస్తుందని, అలంకరణ లేకుండా ఉంచుతారు. అమ్మవారు ఉగ్రరూపం దాల్చకుండా ప్రజలను శాంతంగా కరుణించాలని పనిబాపలోళ్లగా ఉండే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు అమ్మవారి శక్తిని ఆవహింపజేసుకులా కాంపాళెంలో గాలిగంగలకు పూజలు చేస్తారు. అక్కడ అమ్మవారికి అండగా ఉండేలా గాలిగంగలను ప్రసన్న చేసుకున్న అనంతరం చాకలి ఇంట ఉన్న అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క పెట్టి, నగలతో అలంకరిస్తారు. తరువాత రథంపై పోలేరమ్మను ఊరేగింపుగా పట్టణ నడి బొడ్డున ఉన్న ఆలయానికి వేంచేపు చేస్తారు. ఆ తరువాత భక్తులను పోలేరమ్మ దర్శనానికి అనుమతిస్తారు.

రాష్ట్ర పండుగగా గుర్తింపు

వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా చేయాలని గత ఏడాది స్థానిక నేతలు కోరడమే తరువాయి.. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించారు. దీంతో రాష్ట్ర పండుగగా జాతరను వైభవంగా నిర్వహించారు.

సందడే..సందడి



వెంకటగిరిలో రేణుకా ఎల్లమ్మ బృందం ప్రదర్శన

పోలేరమ్మ జాతర సందర్భంగా వెంకటగిరిలో సందడి.. సందడిగా ఉంటుంది. జాతరకు ఇసుక వేస్తే రాలంత జనం వస్తుంటారు. దీంతో వెంకటగిరిని ప్రత్యేకంగా అలకరించడంతో పాటు పిల్లలకు పలు వినోదాలు అందించే జెయింట్ వీలర్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి గురువారం వరకు ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. బంధువుల రాకపోకలు, జాతర నిర్వహణకు రూ.కోట్లు ఖర్చు అవుతుంది.

తొలి పూజ రాజాలదే

పోలేరమ్మ జాతర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నప్పటికీ వెంకటగిరి రాజాలకే తొలి ప్రాధాన్యత ఇచ్చే సంప్రదాయాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే అమ్మవారికి రాజాల నివాసం నుంచి పట్టు వస్త్రాలను రాజాల ప్రతినిధుల ద్వారా అందజేస్తారు. అలాగే జాతర తొలి చాటింపు వేసేందుకు కూడా అనుమతి తీసుకునే క్రమంలో రాజా కుటుంబీకులు పెద్దరెడ్డి ద్వారా పనిబాపలోళ్లకు తాంబూలం అందిస్తారు.

పాలి.. బలితో జాతర ముగింపు



జీవాలను అమ్ముతున్న దృశ్యం

బుధవారం రాత్రి ప్రారంభమైన జాతర గురువారం వేకువ జాముకు గుడి వద్ద అమ్మవారి నిలుపుతో సగం పూర్తి అయినట్లే, అటు తరువాత మధ్యాహ్నం 3 గంటల సమయంలో పాలి.. బలి కార్యక్రమం నిర్వహిస్తారు. ఊరేగింపు మల్లమ్మగుడివీధి వద్ద కైవల్యానది తీర ప్రాంతంలో ఉన్న నిష్కమణ మండపం వద్దకు చేరుకోగానే అమ్మవారి కళ్లను తొలగిస్తారు. అనంతరం అమ్మవారి విగ్రహం మట్టిని తీసుకునేందుకు భక్తులు పోటీ పడతారు. ఈ మట్టి ఇంటిలోని పూజ గదిలో ఉంచుకుంటే శుభం కలుగుతుందని భక్తుల్లో బలమైన నమ్మకం.

పకడ్బందీగా జాతర

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

వెంకటగిరి పోలేరమ్మ జాతర ప్రశాంత వాతావరణలో పకడ్బందీగా జరిగేలా సంబంధింత శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. వెంకటగిరి పట్టణంలోని పింజలి వీరయ్య కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మునిసిపల్ చైర్మన్ నక్కా భానుప్రియతో కలిసి జాతర ఏర్పాట్లపై సంబంధింత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటగిరి పోలేరమ్మ జాతర వైభవంగా నిర్వహించేందుకు సంబంధించిన శాఖల విభాగాలు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందని, ప్రశాంత వాతావరణలో అమ్మవారి దర్శనం జరిగేలా చూడాలని కోరారు. క్యూల నియంత్రణ, పోలీసు బందోబస్తు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే తాగునీరు సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. బ్యారికేడ్లు, పబ్లిక్ సిస్టమ్ అనౌన్స్‌మెంట్, రవాణా సౌకర్యం, హెల్ప్ డెస్క్ తదితర ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలన్నారు. ఈనెల 25 మధ్యాహ్నం 3 నుంచి 26 రాత్రి 7 గంటల వరకు డ్రైడేగా ప్రకటించిన నేపథ్యంలో మద్యం దుకాణాలు మూసి వేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ జాతరకు సుమారుగా 1,245 మంది పోలీసులను బందోబస్తుకు నియమించామన్నారు. 104 సీసీ కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25 రాత్రి 7 నుంచి 9గంటల వరకు పాత బస్టాండ్ సమీపంలో ఆరుబయట మాత్రమే కాల్చేందుకు అనుమతి మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్ర ప్రభుత్వం తరుపున పోలేరమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, అడిషనల్ ఎస్పీ మనోహరిచారి, గూడూరు డీఎస్పీ రమణకుమార్, జిల్లా దేవాదాయ శాఖాశాధికారి రామకృష్ణారెడ్డి, కమిషనర్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం వివక్ష!

- భూమనపై అలా.. టీడీపీపై ఇలా
- పోలీసుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



తిరుమలలో భూమన కరుణాకరరెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: టీటీడీలో సోమవారం చోటు చేసుకున్న ఘటనల్లో పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల లడ్డూ ప్రసాదంపై చేసిన ఆరోపణలను టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తీవ్రంగా పరిగణలోకి తీసుకున్నారు. నెయ్యిలో ఎటువంటి పశువుల కొవ్వు కలపలేదని, తప్పు చేసి ఉంటే నాశనమై పోతామని, రక్తం కక్కుకుని చావాలని శ్రీవారి ఎదుట ప్రమాణం చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా భూమన సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకుని పుష్కరిణిలో స్నానం చేశారు. అనంతరం అఖిలాండం వద్దకు చేరుకుని, కర్పూరం వెలిగించి ప్రమాణం చేయడం ప్రారంభించారు. ఈ పరిణామంతో భయపడిన ప్రభుత్వ పెద్దలు పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐ విజయకుమార్, క్రైమ్ సీఐ శేషగిరి, ఎస్ఐ రమేష్‌బాబు భూమన కరుణాకరరెడ్డి మోకాలికి ఆపరేషన్ చేసుకుని అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసి కూడా బలవంతంగా లాగి కారులో ఎక్కించారు. ఈ పెనుగులాటలో భూమన కాలునొప్పి తీవ్రమైంది. మీడియాతో మాట్లాడమని విలేకరులు అడిగినా.. తిరుమలలో రాజకీయాలు మాట్లాడనని, అలిపిరి వద్ద మాట్లాడుతానని చెప్పారు. అయినా పోలీసులు వినకుండా భూమనను చుట్టుముట్టి లాక్కెళ్లడం కనిపించింది. అలిపిరి వద్ద మీడియాతో మాట్లాడుతారని తెలుసుకున్న పోలీసులు భారీగా మోహరించారు. అలిపిరి చేరుకున్న భూమనను కారు దిగనివ్వకుండా.. ముందూ వెనుక పోలీసు వాహనాలతో నివాసం వరకు తీసుకెళ్లారు.

అలిపిరి వద్ద టీడీపీ నినాదాలు.. మీడియా సమావేశం



గోవిందా..గోవిందా అని అరుస్తున్న టీడీపీ నేతలు

భూమన కరుణాకరరెడ్డి ప్రమాణం చేయడంతో ఉలిక్కిపడిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ మరికొంత మంది టీడీపీ శ్రేణులు సోమవారం రాత్రి అలిపిరికి చేరుకున్నారు. అంతా గుమికూడడంతో పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సుగుణమ్మ, శ్రీధర్‌వర్మ వినిపించుకోలేదు. శ్రీధర్ వర్మ తాము మీడియాతో మాట్లాడాల్సిందేనని పట్టుబట్టారు. కుదరదని పోలీసులు బతిమలాడారు. అయినా వినిపించుకోలేదు. గోవిందా.. గోవిందా అంటూ అరిచి మీడియాతో మాట్లాడారు. ఒక్కొక్కరికి బైట్లు ఇచ్చి అధికార దౌర్జన్యాన్ని ప్రదర్శించారు. ఈ పరిణామాన్ని గమనించిన స్థానికులు అధికార పార్టీ నేతలు, పోలీసుల తీరుని తప్పుబట్టడం గమనార్హం.



గోవింద నామస్మరణ చేస్తున్న ఎంపీ గురుమూర్తి, భూమన కరుణాకరరెడ్డి

27న పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్ మేళా

- పది నుంచి డిగ్రీ వరకు చదివిన నిరుద్యోగులు అర్హులు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్థానిక కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడీఎఫ్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో శ్రీసిటీలోని బహుళ జాతీయ కంపెనీలైన డైకిన్ ఎయిర్ కండిషనర్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, శ్రీరామ్ చిట్స్, ఎస్‌బీబీ మెడికేర్ తదితర సంస్థల్లో ఉద్యోగాలకు ఆయా సంస్థల ప్రతినిధులతో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, బీటెక్ తదితర డిగ్రీ విద్యార్హత కలిగిన వారు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు జిరాక్స్, విద్యార్హత సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలు, బయోడేటాను రిజిస్ట్రేషన్ లింకు అయిన ''హెచ్‌టీటీపీఎస్://ఎస్‌హెచ్‌ఓఆర్‌టీయూఆర్‌ఎల్.ఏటీ/క్యూజెడ్‌ఆర్‌ఎక్స్‌జె'' ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకుని వెంట తీసుకురావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 81435 76866 నంబరులో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.



తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.76,900
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,980
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.91,200
రిటైల్ వెండి గ్రాము రూ.94.20

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు ఎం.కావ్య, ఎన్.కిరణ్మయి, డీ.శ్రీనాథ్, జీ.నవదీప్ రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై నట్లు కళాశాల పీడీ మల్లికార్జున్‌రెడ్డి సోమవారం తెలిపారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 22న జరిగిన సెలెక్షన్స్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు వెల్లడించారు. అక్టోబర్ 5, 6 తేదీలలో విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్‌కు బెయిల్ మంజూరు



సామకోటి సహదేవరెడ్డి

భాకరాపేట: పుంగనూరు కేసులో సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సామకోటి సహదేవరెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరైంది. ఈ మేరకు సోమవారం మదనపల్లె జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మాట్లాడుతూ పుంగనూరు పర్యటనకు వెళ్లిన ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్పపై దాడి జరిగిన విషయం తెలిసిందే అన్నారు. ఈ దాడిలో పలు వాహనాల ధ్వంసం చేయడంతో పాటు, మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై దాడికి పాల్పడ్డారు. అయితే తిరిగి ఎంపీ, మాజీ ఎంపీతో పాటు పలువురిపై కేసులు నమోదయ్యాయన్నారు. ఈ కేసులో తనకు కోర్టు ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసిందన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



ట్రాన్స్‌జెండర్ విభాగంలో మొదటి బహుమతి అందుకుంటున్న స్వీటి



విజేతలకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఈ నెల ఒకటో తేదీన ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో యూత్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన 5కే రెడ్‌రన్ మారథాన్ క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లుతోపాటు ప్రైజ్ మనీ చెక్కులను పంపిణీ చేశారు. 5 కే రెడ్‌రన్ మారథాన్ పురుషుల విభాగంలో వి.చరణ్ కుమార్‌కు మొదటి బహుమతిగా రూ.7వేలు, రెండవ బహుమతిగా జి రాజాకు రూ.4వేల చెక్కును అందజేశారు. అలాగే స్త్రీల విభాగంలో వీకే సాయిప్రియకు మొదటి బహుమతిగా రూ.7వేలు, రెండో బహుమతిగా జి.రజనీకి రూ.4 వేల చెక్కును అందజేశారు. ట్రాన్స్ జెండర్ విభాగంలో ఎం.స్వీటీకి మొదటి బహుమతిగా రూ.7వేలు, రెండో బహుమతిగా టి.తేజస్వినికి రూ.4వేల చెక్కును అందజేశారు. రెడ్ రిబ్బన్ క్విజ్ ప్రోగ్రామ్‌లో మొదటి బహుమతిగా ఎస్. చెంచమ్మకు రూ.7వేలు, రెండో బహుమతి బి.రాధికకు రూ.3500 చెక్కును అందజేశారు. రెడ్ రిబ్బన్ క్విజ్ ప్రోగ్రామ్‌లో టీం సభ్యులులైన ఎన్. హాసినికి రూ.5 వేలు, ఎం.శశిప్రియ దర్శినికి రూ.2500 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వి.శేఖర్, జిల్లా కుష్టు,ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వారిని అరెస్టు చేయాల్సిందే!



ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఫ్లెక్సీని చించి అవమానించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, దళిత డాక్టర్‌ను కించపరిచేలా దూషిస్తూ దాడి చేసి గాయపరిచన ఎమ్మెల్యే నానాజీని వెంటనే అరెస్టు చేయాలని దళిత, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. కూటమి ఎమ్మెల్యేల దుశ్చర్యను నిరసిస్తూ అంబేద్కర్ భవన్ అసోసియేషన్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దళిత వ్యతిరేక ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలను దహనం చేశారు. – తిరుపతి కల్చరల్

పేలిన బాయిలర్

- మేనకూరు అల్యూమినియం పరిశ్రమలో ఘటన
- తృటిలో తప్పిన ప్రమాదం



అల్యూమినియం పరిశ్రమలో బాయిలర్ పేలిపోవడంతో కమ్ముకున్న దట్టమైన పొగ

నాయుడుపేటటౌన్ : మండలంలోని మేనకూరు సెజ్‌లో ఉన్న ఏకో బిటా అల్యూమినియం చిన్న తరహా పరిశ్రమ వద్ద సోమవారం ప్రమాదవశాత్తు బాయిలర్ (చిమ్నీ)కి సంబంధించి మోటార్ ఒక్కసారిగా పేలి పోయింది. దీంతో మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. అయితే బాయిలర్ వద్ద కార్మికులు ఎవరూ లేక పోవడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. బాయిలర్ ప్రమాదవశాత్తు పేలిన విషయం వాస్తవమేనని మేనేజర్లు తెలిపారు. పరిశ్రమ చిమ్నీ నుంచి మంటలు ఎగిసితున్నాయని, అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జగరలేదన్నారు.

ఎర్రచందనం స్వాధీనం

- స్మగ్లర్ అరెస్టు
- 2 కార్లు, 2 మోటారు సైకిళ్లు సీజ్



ఎర్రచందనం, వాహనాల సహా స్మగ్లర్‌ను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం : భాకరాపేట అటవీ ప్రాంతంలో 11 ఎర్రచందనం దుంగలతోపాటు, రెండు కార్లు, రెండు మోటారు సైకిళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని, స్మగ్లర్ ఒకరిని సోమవారం అరెస్టు చేశారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పట్టుబడిన ఎర్రచందనంతోపాటు వాహనాలు, స్మగ్లర్‌ను తీసుకొచ్చి కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ డీ.మురళీధర్ సూచనలతో ఆర్‌ఎస్‌ఐలు విష్ణువర్ధన్ కుమార్, సురేష్‌బాబు ఆదివారం సాయంత్రం నుంచి తిరుపతి ఫారెస్ట్ డివిజన్ భాకరాపేట అటవీప్రాంతంలోని ఎర్రావారిపాళెం నుంచి ఎల్లమంద, ఉస్తికాయలపెంట అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. అక్కడ నుంచి పీలేరు–భాకరాపేట మెయిన్ రోడ్డులో ఎల్లమంద క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. సోమవారం ఉదయం టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని చూసిన రెండు కార్లు దూరంగా ఆగి పోయి, పారిపోయే ప్రయత్నం చేశారు. కార్లకు పైలట్లుగా వచ్చిన రెండు మోటారు సైకిళ్ల అక్కడే ఆపి, ఇద్దరు పారిపోయేందుకు ప్రయత్నించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని వెంబడించగా ఒకరిని పట్టుకున్నారు. అతను తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ రఫీ తెలిపారు.

వచ్చే మార్చికి పక్కా ఇళ్లు వందశాతం పూర్తి

తిరుపతి అర్బన్: అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పక్కాగృహాలను వచ్చే ఏడాది మార్చి 31 తేదీనాటికి వందశాతం నిర్మాణాలు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం హౌసింగ్ జిల్లా అధికారి వెంకటేశ్వరావుతో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూఫ్ లెవల్, శ్లాబ్ లెవల్‌లోని ఇళ్ల నిర్మాణాలు వచ్చే అక్టోబర్ 31 తేదీకి పూర్తి చేయాలని చెప్పారు. పునాదుల స్థాయిలోని ఇళ్లు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీకి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 24, 25 తేదీల్లో మండల స్థాయిలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షలు నిర్వహించాలని చెప్పారు. అలాగే ఈ నెల 26వ తేదీన హౌసింగ్ లేఅవుట్ల వద్ద అధికారులతో సమీక్షలు, 28వ తేదీన జిల్లాలోని అందరు హౌసింగ్ లబ్ధిదారులతో వారి పరిధిలోని లే అవుట్ల వద్ద అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డీపీఓ సుశీలాదేవి, సీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంఘమిత్ర చేతివాటం!

చంద్రగిరి : మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న రుణాలను అక్రమంగా దోచుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొదుపు సంఘ సభ్యులకు తెలియకుండా ఓ సంఘమిత్ర రూ.లక్షలు కాజేసింది. వివరాలు.. మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో శ్రీవినాయక మహిళా సంఘం ఉంది. ప్రతి నెలా సభ్యులు కంతుల వారీగా నగదు చెల్లిస్తూ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ సంఘం మిత్ర తన చేతివాటం ప్రదర్శించింది. సుమారు రూ.10లక్షలను విత్‌డ్రా చేసేసింది. ఇటీవల నెలవారీ వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవంతో అధికారులకు అనుమానం వచ్చింది. విచారణలో సభ్యులకు సమాచారం లేకుండా సంఘమిత్ర చేసిన నిర్వాకం బయటపడింది. దీంతో వెంటనే సభ్యులు ఈ విషయాన్ని సీసీ ధనుంజయ దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆయన సదరు సంఘమిత్రకే అనుకూలంగా మాట్లాడినట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. సంఘమిత్రతో సీసీ కుమ్మక్కైనట్లు అనుమానంగా ఉందని మహిళలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

విడతల వారీగా రికవరీ

సంఘమిత్ర, సీసీ నిర్వాకంపై కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలిసింది. దీంతో వారు చేసేది లేక గుట్టుచప్పుడు కాకుండా దిగమింగిన సొమ్మును విడతల వారీగా తిరిగి చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు రూ.6.5లక్షలు కట్టారని, మిగిలిన నగదును రికవరీ చేయాల్సి ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చంద్రగిరి ఏపీఎం సరితను వివరణ కోరగా వినాయక సంఘంలో అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలిందన్నారు. సంఘ మిత్ర నుంచి నగదు రికవరీ చేస్తున్నట్లు చెప్పారు.

చావే శరణ్యం



తాళ్వాయిపాడు వద్ద వద్ద యంత్రాలతో ఇళ్లు తొలగింపు

- జాతీయ రహదారిపై నిర్వాసితుల గగ్గోలు
- పరిహారం చెల్లించకుండా ఇళ్లు తొలగించే ప్రయత్నం

పెళ్లకూరు: 71వ జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా సోమవారం చిల్లకూరు, తాళ్వాయిపాడు, చెంబడిపాళెం, ఎగువచావలి గ్రామాల్లో పరిహారం చెల్లించకుండా ఇళ్లు తొలగించడంతో తమకు చావే శరణ్యమంటూ రోడ్డెక్కి గగ్గోలు పెట్టారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ రేణిగుంట–నాయుడుపేట పట్టణాలను కలుపుతూ సుమారు 57 కిలోమీటర్లు పొడవున రూ.2,200 కోట్ల నిధులతో ఆరులేన్ల రహదారి విస్తరణ పనులు చేస్తున్నారన్నారు. సర్వే పనులు సక్రమంగా చేయకుండా.. నష్టాలను పూర్తి స్థాయిలో అంచనా వేయకుండా సుమారు రూ.15 లక్షలు నుంచి రూ.20 లక్షలు విలువ చేసే ఇళ్లకు కేవలం రూ.5 లక్షలు విలువ కట్టి, కంటి తుడుపు పరిహారం చెల్లిస్తామంటూ నోటీసులు ఇచ్చి ఇళ్లు తొలగించేస్తామంటే, తమకు చావే శరణ్యమని వాపోయారు. కాగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పోలీసుల బందోబస్తు నడుమ ఇళ్లు తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. నష్ట పరిహారం చెల్లించేంత వరకు ఇళ్లు తొలగిస్తే ఊరుకోమంటూ, ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనుకాడమంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇళ్లు తొలగించేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన అధికారులంతా కలిసి తమకు చెల్లించాల్సిన పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు విన్నవించారు.

ఒక్కొక్కటిగా బదిలీల జాబితా విడుదల

- మరో రెండు రోజుల సమయం

తిరుపతి అర్బన్: ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు ఆదివారంతో గడువు ముగిసింది. అయితే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పూర్తి అయిన తర్వాతే రిలీవ్ కావాలని ప్రభుత్వ పెద్దలు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో 50 శాతం విభాగాల్లో మాత్రమే బదిలీల సమాచారం ఇచ్చారు. మరో 50 శాతం డిపార్ట్‌మెంట్లలో బదిలీలు అయినప్పటికీ జాబితాను విడుదల చేయలేదు. ప్రధానంగా ఇప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగుల జాబితా విడుదల కాలేదు. జిల్లా అధికారులు గోప్యంగానే తమ చేతుల్లో జాబితాను ఉంచుకున్నారు. అయితే జాబితా విడుదల చేయకున్నా ప్రథమ, ద్వితీయ శ్రేణి ఉద్యోగులకు మాత్రమే తాము ఎక్కడికి బదిలీ అయిన సమాచారాన్ని ఇచ్చారు. తృతీయ శ్రేణి ఉద్యోగులకు మాత్రం బదిలీ సమాచారం సైతం చెప్పలేదు. 26వ తేదీ లోపు వెల్లడిస్తామని చెబుతున్నారు. ఈ క్రమంలో అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగుల వివరాలు స్పష్టం చేయడానికి మరో రెండు రోజుల సమయం పట్టేలా ఉంది.

సోమవారం విడుదల చేసిన బదిలీలు

కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ఇంజినీర్ నరేంద్రబాబును విజయవాడకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న మురళిని తిరుపతిలో నియమించారు. అదే విభాగంలో ఇంజినీర్ అశోక్ కుమార్‌ను నెల్లూరుకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న రాజశేఖర్‌ను తిరుపతికి బదిలీ చేశారు. అంతేకాకుండా గ్రేడ్–1 ఇంజినీర్ సుధాకర్‌ను కర్నూలుకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న గణేష్‌ను తిరుపతికి బదిలీ చేశారు. అలాగే సివిల్ సప్లయిస్ జిల్లాఅధికారి రాజారఘువీర్‌ను కర్నూలు జిల్లాకు, చిత్తూరు జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి శేషాచలం రాజును తిరుపతికి బదిలీ చేశారు.

రెవెన్యూలో 132 మంది బదిలీ

ప్రభుత్వం రెవెన్యూలో భారీ ప్రక్షాళన చేపట్టనుంది. ఈ క్రమంలోనే 132 మందిని బదిలీలు చేయనున్నారు. ప్రధానంగా డీటీలు 51 మంది, 22 మంది ఆర్‌ఐలు, 28 మంది సీనియర్ అసిస్టెంట్లు, 31 మంది జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. అయితే వీఆర్వోల బదిలీలు వివరాలు సోమవారం వెల్లడించలేదు. మంగళవారం 395 మంది వీఆర్వోల జాబితాను వెల్లడించనున్నారు.

ఘనంగా శుభ్‌శ్రీ వస్త్రాలయ వార్షికోత్సవం



శుభ్‌శ్రీ వస్త్రాలయంలో కొనుగోలు దారుల సందడి

తిరుపతి కల్చరల్: వీవీ మహల్ రోడ్డులోని పీ ఎంఆర్ ప్లాజాలో ఉన్న ప్రముఖ వస్త్ర సంస్థ శుభ్ శ్రీ షోరూంలో సోమవారం ఆ వస్త్రాలయ 12 వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా వస్త్రాలపై అందించిన 50 శాతం డిస్కౌంట్ సేల్ వినియోగదారులు అమూల్యమైన వస్త్రాలను కొనుగోలు చేశారు. కాంజీవరం పట్టు, డిజైనరీ శారీలు, టస్సర్, బెనారస్, అన్‌స్టిచ్డ్ సూట్స్ సల్వార్స్, కుర్తీస్ వంటి అనేక వస్త్రాలు నూతన డిజైన్లలో సరికొత్త స్టాక్ వచ్చిందని ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఓం ప్రకాష్ తెలిపారు. అన్ని రకాల వస్త్రాలపై పరిమిత కాలంలో 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు.

నవోదయ దరఖాస్తుకు గడువు పెంపు

తిరుపతి ఎడ్యుకేషన్ : 2025–26వ విద్యా సంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబరు 7వ తేదీ వరకు గడువును పొడిగించారు. ఆ మేరకు తిరుపతిలోని పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలకు తమ కోచింగ్ సెంటర్‌లో నేరుగానీ, అలాగే 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన కోరారు.

ఓవరాల్ చాంపియన్ అనంతపురం

- ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు
- బాలబాలికల విభాగాల్లో రన్నర్స్ కర్నూలు, చిత్తూరు
- తృతీయ స్థానంలో గుంటూరు, నెల్లూరు



విజేతలతో నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68 రాష్ట్రస్థాయి అండర్–14 బాలబాలికల జూడో పోటీలు సోమవారంతో ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య బరువు ఆధారంగా ఏడు కేటగిరీల్లో పోటీలు రసవత్తరంగా సాగాయి. బాల బాలికల విభాగంలో అనంతపురం జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఇక బాలుర విభాగంలో కర్నూలు జిల్లా, గుంటూరు జిల్లా, బాలికల విభాగంలో చిత్తూరు, నెల్లూరు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఆయా జట్లకు ఎస్‌జీఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి ఎస్.బాబు, డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్ పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు చామంతి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి బి.సుబ్రమణ్యంరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి అండర్–14 బాల బాలికల జూడో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

బాలుర విభాగం.. టి.జయసింహ, ఎస్.దర్శన్ తేజ, డి.యశ్వంత్, ఎం.విక్రాంత్, ఎస్ఏ.మీరజ్, (అనంతపురం జిల్లా), ఎం.వినోద్‌కుమార్ (గుంటూరు జిల్లా), ఎం.జాకీర్ అహ్మద్ (కృష్ణా జిల్లా).

బాలికల విభాగం: ఎ.అక్షయణి, ఎస్.మీరా జాస్మిన్, బి.నాగశ్వేత, బి.ప్రవల్లిక, బి.కావ్య (అనంతపురం జిల్లా), బి.భావన, జి.పూజిత (చిత్తూరు జిల్లా).

ఘనంగా ఐఎమ్‌ఏ సమావేశం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఐఎమ్‌ఏ ప్రతినిధులు

తిరుపతి తుడా: వైద్య విజ్ఞాన అధ్యయనంలో భాగంగా సోమవారం తిరుపతిలో ఐఎమ్‌ఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) తిరుపతి శాఖ ఆధ్వర్యంలో నెలవారీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించి ఆస్పత్రులకు రావాల్సిన బకాయిలను చెల్లించి, ప్రస్తుతం ఇస్తున్న టారిఫ్‌ను పెంచాలని కోరారని తెలిపారు. ఐఎమ్‌ఏ జాతీయ మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ దగ్గమాటి శ్రీహరిరావు మాట్లాడుతూ సింగిల్ విండో ద్వారా ఆస్పత్రులకు అనుమతి ఇవ్వాలని, ఫైర్ ఎన్‌ఓసీ ఐదేళ్లకు ఇవ్వాలని, దేశవ్యాప్తంగా ఒకే రక్షణ చట్టం ఉండాలన్నారు. తిరుపతి అధ్యక్షుడు డాక్టర్ జనార్దన్, రష్ హాస్పిటల్ యూరాలజిస్ట్ కీర్తి సాగర్‌రెడ్డి, సిపాయి మోహన్‌రెడ్డి, పవన్, జి సుబ్రమణ్యం, ఆనంద నాయుడు, హరికుమార్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, వాసుదేవ నాయుడు, రామచంద్రరావు. ఆర్ముగం, హరినాథ్, రామచంద్ర, అనిల్, రవిరాజు, పద్మనాభరెడ్డి, కృష్ణకాంత్, వెంకట రమణ పాల్గొన్నారు.

శాస్త్ర విజ్ఞానం పెంపునకే ఇన్‌స్పైర్



సైన్స్ ఇన్‌స్పైర్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారి

నాయడుపేటటౌన్: ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికీ శాస్త్ర విజ్ఞానం పెంచేందుకే ఇన్‌స్పైర్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణంలోని ఎల్ఏ సాగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం గూడూరు డివిజన్ పరిధిలోని 150 మంది సైన్స్ ఉపాధ్యాయులకు సైన్స్ ఇన్‌స్పైర్ 2024–25 ఏడాదికి సంబంధించి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఇన్‌స్పైర్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక విజ్ఞానం పెంపొందేలా బోధన చేయాలన్నారు. సాంకేతిక అంశాలపై విద్యార్థులతో అధ్యయనం చేయించాలని సూచించారు. అలాగే వర్క్‌షాప్ కోఆర్డినేటర్ రివేష్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కల్లూరు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని పాఠశాల విద్యార్థులతో త్వరితగతిన శుభ్రం చేసే అధునాతన పారిశుద్ధ్య పరికరాలకు ఇటీవల జరిగిన సైన్స్ ఇన్‌స్పైర్ ప్రాజెక్టులో జాతీయస్థాయి గుర్తింపు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా కల్లూరు పాఠశాల ఉపాధ్యాయులను జిల్లా అధికారితో పాటు గూడూరు డిప్యూటీ డీఈఓ శాంతి, ఎంఈఓ మునిరత్నం తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అన్నామణి, పాలచ్చూరు రవి, రాజేష్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడితో నలిగిపోతున్నాం!



కలెక్టరేట్‌కు వచ్చిన సచివాలయ వైద్యవిభాగం ఉద్యోగులు

- ఉద్యోగం ఎంతో భారంగా మారుతోంది
- సచివాలయ వైద్యశాఖ ఉద్యోగులు కలెక్టర్‌కు ఆవేదన
- గ్రీవెన్స్‌కు 224 అర్జీలు
- రెవెన్యూశాఖకు 144 అర్జీలు

తిరుపతి అర్బన్: 'అయ్యా.. రెండు శాఖల అధికారుల ఒత్తిడితో నలిగిపోతున్నాం. వైద్యశాఖ పనులే కాకుండా ఇతర శాఖల పనులను మాకే అప్పగిస్తున్నారు. దీంతో ఉద్యోగం చేయడం ఎంతో భారంగా మారుతుంది. మాకు న్యాయం చేయండి సార్.' అంటూ గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వైద్య ఉద్యోగులు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ హంస సంఘం జిల్లా అధ్యక్షులు రాజాతోపాటు పలువురు వారికి మద్దతు పలికారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరితోపాటు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి, డీపీఓ సుశీలాదేవితో మాట్లాడారు. వారి విభాగానికి చెందిన వర్క్స్ మాత్రమే వారికి చెప్పాలని స్పష్టం చేశారు. మరోవైపు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. 224 అర్జీలు వచ్చాయి. అందులో 144 అర్జీలు రెవెన్యూ సమస్యలకు చెందినవి స్వీకరించారు. స్పందనలో జేసీ శుభం బన్సల్‌తోపాటు డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చంద్రశేఖర్‌నాయుడు, రామ్మోహన్, నరసింహులు పాల్గొన్నారు.